క్లుప్తంగా

రీ సర్వేతో భూ సమస్యలకు మోక్షం



విలసవిల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూసర్వే శాశ్వత భూహక్కు పథకంతో భూ సమస్యలు తొలగుతాయని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన బుధవారం భూ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అధికంగా భూమి ఆక్రమణలో ఉందని, వాటిని గుర్తించి వెలికితీయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, రీ సర్వే డీటీ వైవీవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సర్వేయర్ కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు అన్నదమ్ముల షష్టి వేడుకలు



నడవపల్లిలో తల్లిదండ్రుల సమక్షంలో షష్టి వేడుకలు చేసుకున్న అన్నదమ్ములు

కాట్రేనికోన: నడవపల్లి గ్రామంలో అల్లూరు సుబ్బరాజు 94, అన్నపూర్ణయ్యమ్మ 88 దంపతుల ఐదుగురు పుత్రులకు షష్టి వేడుకలు వైభవంగా జరిగాయి. తల్లిదండ్రుల సమక్షంలో కుమారులు అల్లూరు వెంకట రమణరాజు-సత్యవతి, అల్లూరు సత్యనారాయణరాజు-పద్మావతి, అల్లూరు సూర్యనారాయణ రాజు-సూర్య శ్రీదేవి, అల్లూరు సుబ్రమణ్యంరాజు-సత్యవాణి, అల్లూరు శ్రీరామరాజు-నిర్మల దంపతులకు 60 ఏళ్ల పూర్తి కావడంతో ఈ వేడుకలు చేసుకున్నారు. వీరి తల్లి అన్నపూర్ణయ్యమ్మ సినిమా హీరో రవితేజ మేనత్త.

గజమాల యాత్రకు మంత్రికి ఆహ్వానం

రాజోలు: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ గజమాల యాత్రకు మంత్రి విశ్వరూప్‌ను అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు బుధవారం ఆహ్వానించారు. ఈ నెల 14వ తేదీన అల్లవరం మండలం ఓడలరేవు నుంచి యాత్ర ప్రారంభమవుతుందని, ఆ వేడుకలో పాల్గొనాలని కోరారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకటరామరాజు, గజమాల యాత్ర వ్యవస్థాపకుడు చింతా మహానాగరాజు, రాజోలు నియోజకవర్గ అగ్నికుల సంఘాల సమైఖ్య అధ్యక్షుడు ఇల్లింగి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మాక్‌డ్రిల్

యానాం: ప్రకృతి వైపరీత్యాల్లో రక్షణ చర్యలపై ఈ నెల 15న పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో యానాంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్టు ఆర్‌ఏఓ మునిస్వామి తెలిపారు. మాక్‌డ్రిల్ సందర్భంగా బంగాళాఖాతంలో ఏర్పడిన సైక్లోన్ స్టార్మ్‌ను ఓలిగా నామకరణం చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



అరటికాయలంకలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న జెడ్పీటీసీ సాగర్

తాళ్లరేవు: ఇంజరం పంచాయతీ అరటికాయ లంక గ్రామానికి చెందిన అంబటి శ్రీరాములు ఇటీవల మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీరాములు కుమారుడు సత్యనారాయణ వైఎస్సార్ సీపీ కార్యకర్తగా విశేష సేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో జెడ్పీటీసీ టొమ్మేటి సామ్యూల్ సాగర్ బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి, 25 కిలోల బియ్యం, ఆర్థికసాయాన్ని అందజేశారు.

ప్యాడ్కో రుణం మంజూరు చేయాలి

యానాం: పుదుచ్చేరి వినాయక రీసెర్చ్ ఫౌండేషన్‌లో చదువుతున్న పది మంది ఎస్సీ విద్యార్థులకు ప్యాడ్కో విద్యా రుణం మంజూరు కాలేదని వారి తల్లిదండ్రులు బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రుణం కోసం వినతిపత్రాలు ఇచ్చినా, సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో విద్యార్థులకు పరీక్ష హాల్ టికెట్లు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించాలని వారు అధికారులను కోరారు.

సేవకు ప్రతి ఫలం

- ఉత్తమ వలంటీర్లకు పురస్కారాలు
- 1,586 మందికి అవార్డులు
- నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేత

ముమ్మిడివరం: సరికొత్త ఆలోచనతో వలంటీర్ వ్యవస్థకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవం పోశారు. ఆ బాధ్యతలు తీసుకున్న వారు సైనికుల్లా, సేవా వారధుల్లా నూతనోత్సవంతో ముందుకు సాగుతున్నారు. సంక్షేమ పథకాలను అర్హుల చెంతకు చేరుస్తున్న వలంటీర్ల సేవలను మెచ్చి, ప్రభుత్వం ఏటా ప్రతిభా పురస్కారాలను అందిస్తోంది. వలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. సేవా వజ్రకు రూ.30 వేలు, సేవా రత్నకు రూ.20 వేలు, సేవా మిత్రకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహకాలు అందించనున్నారు. వీటితో పాటు అవార్డు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి పింఛను అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

గ్రహీతలకు జ్ఞాపికలు, పతకాలు, బ్యాడ్జీలతో సత్కరించనున్నారు. గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డుల ప్రదానోత్సవం ప్రారంభించనున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల పరిధిలో మొత్తం 1,586 మంది వలంటీర్లకు అవార్డులు అందించనున్నారు. ఇందులో సేవా వజ్ర ఐదుగురు, సేవా రత్న 25 మంది, సేవా మిత్ర 1,556 మంది అందుకోనున్నారు.

మండలం	సేవా వజ్ర	సేవా రత్న	సేవా మిత్ర
ముమ్మిడివరం అర్బన్	1	5	130
ముమ్మిడివరం రూరల్	2	5	243
కాట్రేనికోన	0	5	385
ఐ.పోలవరం	2	5	338
తాళ్లరేవు	0	5	460
మొత్తం	5	25	1,556

ఆనందంగా ఉంది



సేవా వజ్ర అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉంది. వలంటీర్‌గా నాకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నా. నాతో పాటు ప్రతి ఒక్కరూ గ్రామాల్లో కష్టపడి సేవలందిస్తున్నారు. అధికారులు అప్పగించిన బాధ్యతలు సకాలంలో పూర్తి చేస్తున్నాం.

– పచ్చిమట్ల సాయినాగ శ్రీవాణి, వలంటీర్, సేవా వజ్ర, కొత్తలంక

సామాజిక దృక్పథంతో..



సేవా రత్న అవార్డు రావడంతో నాపై బాధ్యత మరింత పెరిగింది. ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం కోసం కాకుండా, సామాజిక సేవా దృక్పథంతో సేవలందిస్తున్నాం. ప్రతిఒక్కరూ లక్ష్యాలను పూర్తి చేసి అధికారుల మన్ననలను పొందేందుకు ఈ అవార్డులు దోహద పడతాయి.

– చెల్లి భార్గవి, వలంటీర్, సేవా రత్న, కర్రివానిరేవు సచివాలయం

బాధ్యతగా భావించి..



గ్రామాల్లో ఎంతో కీలకమైన వలంటీర్ పోస్టు ద్వారా ప్రభుత్వం మాకు గుర్తింపునిచ్చింది. ప్రతి ఏడాది మాకు అవార్డులు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. వలంటీర్ పనిని బాధ్యతగా భావించి, ప్రజలకు సేవలందిస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు మాకు అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారు.

– పసుపులేటి శివగణేష్, వలంటీర్, సేవా రత్న, కొత్తలంక

గొప్ప శాస్త్రవేత్తలుగా విద్యార్థులు ఎదగాలి

- మంత్రి పినిపే విశ్వరూప్
- 11వ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ ఎగ్జిబిషన్ ప్రారంభం



సభలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ, భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రభుత్వం సత్సంకల్పాన్ని కలిగి ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఇందులో భాగంగానే ఇన్‌స్పైర్ మనాక్ ఎగ్జిబిషన్, ప్రాజెక్ట్ పోటీలు నిర్వహిస్తోందన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఇన్‌స్పైర్ మనాక్ 11వ జిల్లా స్థాయి ఎగ్జిబిషన్ కం ప్రాజెక్టు పోటీలు-2024 ప్రారంభమయ్యాయి. ఎగ్జిబిషన్ స్టాళ్లు, విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలను మంత్రి పరిశీలించి, ఇన్‌స్పైర్ లోగోను ఆవిష్కరించారు. మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ వైజ్ఞానిక ఆవిష్కరణలను దృష్టిలో ఉంచుకుని సాగించే పరిశోధనల వైపు విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించినట్టు వివరించారు. విద్యార్థుల్లో నిబిడీకృతమైన ఆలోచనా శక్తిని వెలికితీసి, సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని సూచించారు. ఈ ప్రాజెక్టు పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి, రాష్ట్ర, కేంద్ర స్థాయి పోటీలకు చేరాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఇళ్ల వెంకటేశ్వరరావు, కుడిపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, డీఈఓ ఎం కమలకుమారి, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, విద్యాశాఖ అధికారులు, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్(నాని) తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

యానాం: వివిధ పాఠశాలల్లో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నవోదయ విద్యాలయలో ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు ఆధ్వర్యంలో సరస్వతీదేవి చిత్రపటానికి మాల్యార్పణ చేశారు. అనంతరం సీబీఎస్ఈ విద్యార్థులకు అడ్మిట్ కార్డులను పంపిణీ చేశారు. రీజెన్సీ స్కూల్‌లో స్థానిక ప్రైమరీ ప్రాంగణంలో వాగ్దేవికి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అయ్యన్ననగర్ ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమాలు జరిగాయి. గోపాల్‌నగర్‌లోని శారదాదేవి ఆలయంలో విద్యార్థులు విశేష పూజలు నిర్వహించారు.



సరస్వతీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా సిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా ప్రతిష్ఠించిన సిద్ధి వినాయక స్వామి విగ్రహం

అల్లవరం: మొగళ్లమూరు సెంటర్‌లో ఉన్న సిద్ధి వినాయక స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. వేద పండితులు సుదర్శనం వెంకట జనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో నూతన ఆలయం, సిద్ధి వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభం, శిఖర ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎంపీ చింతా అనురాధ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ధ్వజ స్తంభానికి, ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ రాయుడు విష్ణు, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం వద్ద కాంథ్రేగుల వెంకట సత్యనారాయణ, జవహర్‌లాల్, రాధాకృష్ణ, నాగేశ్వరరావు దంపతుల ఆర్థికసాయంతో భారీ అన్న సమారాధన నిర్వహించారు.



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న ఎంపీ చింతా అనురాధ

ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలి

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాలోని నాలుగు డిపోల కార్మికులకు వైద్య సౌకర్యం అందించేందుకు అమలాపురంలో ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావును యునైటెడ్ వర్కర్స్ సంఘ నేతలు విజ్ఞప్తి చేశారు. బుధవారం అమలాపురం నూతన బస్టాండ్ ప్రారంభోత్సవానికి వచ్చిన వీరిని సంఘ నేతలు జి.శ్రీనివాస్, కేఎస్‌పీ రావు, గపప తిరావు కలిసి వినతిపత్రం సమర్పించారు. అమలాపురం డిపో నుంచి చెన్నై, బెంగళూరుకు డైరెక్ట్ బస్సులు ఏర్పాటు చేయాలని, అమలాపురం డిపోలో ఆర్టీసీ పెట్రోల్ బంకును ఏర్పాటు చేయాలని కోరారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో వేయాలని విజ్ఞప్తి చేశారు.



మంత్రి విశ్వరూప్, ఎండీ తిరుమలరావుకు వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు

మహా శివరాత్రి ఏర్పాట్లకు శ్రీకారం

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో మార్చి 8 నుంచి 12 వరకూ జరిగే మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. బుధవారం ఆలయ ఆవరణలో ఉదయం 8.31 గంటలకు పందిరి రాట ముహూర్తానికి ఆలయ చైర్మన్ పెన్మత్స వాసు రాజు , ఆలయ పర్యవేక్షణాధికారి వీరభద్రరావు, ఆలయ పాలక మండలి సభ్యులు భూమిపూజ చేసి, పందిరి రాట నాటారు. ఆలయ అర్చకులు యనమండ్ర సవిత్ర తేజ, స్వస్తి వాచకులు నాగాభట్ల రవిప్రసాద్, వేద పండితులు గంటి సుబ్రహ్మణ్య శాస్త్రి తదితర పండితులు వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ, తెప్పోత్సవం తదితర ఏర్పాట్లు చేయనున్నారు. మహా శివరాత్రి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అన్ని నిబంధనలు పాటిస్తూ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.గంగబాబు, వలవల రామకృష్ణ, దండు వీరభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



పందిరి రాట ముహూర్తం చేస్తున్న చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ లక్ష్మీనారాయణ, పండితులు

సర్పంచ్ దంపతులకు సన్మానం

అల్లవరం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సర్పంచ్‌గా జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా అవార్డును అందుకున్న బోడసుకుర్రు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, నాగేశ్వరరావు దంపతులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. మాజీ సర్పంచ్ టొమ్మేటి శ్యాంప్రకాష్, చెల్లుబోయిన రమేష్, బత్తుల నకులరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు కార్యదర్శుల సత్కారం

ఎంపీడీఓల సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అల్లవరం ఎంపీడీఓ బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్‌ను పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఎన్‌వీవీ సత్యనారాయణ, రాజమోహన్, దుర్గాశ్రీనివాస్, రాజా, కేవీవీ సత్యనారాయణ, శ్రీరామచంద్రమూర్తి, చిక్కం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

జేఈఈ మెయిన్స్‌లో నవోదయ విద్యార్థుల ప్రతిభ

యానాం: ఐఐటీల్లో ప్రవేశానికి అఖిల భారత స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో యానాం నవోదయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు బుధవారం తెలిపారు. విద్యార్థులు యు.జోయెల్‌ఆకాష్ 95 శాతం, శివకుమార్ 78 శాతం, ప్రశాంత్ 56 శాతం మార్కులు సాధించి, ఏప్రిల్‌లో జరిగే అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హతను సాధించారని చెప్పారు.



జోయెల్ ఆకాష్



శివకుమార్



ప్రశాంత్

ప్రగతి పథంలో గ్రామాలు

- రాష్ట్ర రవాణా మంత్రి విశ్వరూప్
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం

అల్లవరం: ప్రజలకు పూర్తి స్థాయిలో అవసరమైన తాగునీరు, ప్రతి గ్రామంలో విశాలమైన రోడ్లు నిర్మించి అభివృద్ధికి పెద్దపీట వేశామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని దేవగుప్తం, ఎస్.పల్లిపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలసి బుధవారం ఆయన ప్రారంభించారు. తొలుత ఎస్.పల్లిపాలెంలో ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణానికి మంత్రి విశ్వరూప్ భూమిపూజ చేశారు. దేవగుప్తంలో ఉపాధి నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, దేవగుప్తం ఉన్నత పాఠశాలలో నాడు-నేడు నిధులు రూ.1.20 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులను, వేదాంత సీఎస్‌ఆర్ నిధులు రూ.38.50 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గ్రామం అభివృద్ధిని సాధించిందని చెప్పారు. సచివాలయం, ఆర్బీకే, ఆరోగ్య కేంద్రం, ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, రోడ్ల నిర్మాణం జరిగాయని వివరించారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తించి, ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, కొల్లు వెంకటరమణ, సుందరనీడి సాయి, జీవీకే చైర్మన్ తిక్కా ప్రసాద్, తుని నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, పార్టీ నాయకులు గుంటూరి బాలరాజు, కర్రి శ్రీను, కుడుపూడి సూర్యప్రకాష్, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, సాధనాల శ్రీను, పినమాల విక్రమ్, పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్, అధికారులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



దేవగుప్తంలో ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌ను ప్రారంభించిన మంత్రి విశ్వరూప్, చిత్రంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

చిరస్థాయిగా నిలిచే పనులు చేశా

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం

ఐ.పోలవరం: పది కాలాల పాటు చిరస్థాయిగా నిలిచే పనులు నియోజకవర్గంలో తన హయాంలో చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం పాతయింజరం, ఎదుర్లంక, టి.కొత్తపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. తొలుత ఎదుర్లంక గ్రామంలో అగ్నికుల క్షత్రియ కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. లంక భూములు నదీ కోతకు గురి కాకుండా గ్రోయన్ల నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. మండలంలో రొయ్యల చెరువుల రైతులకు, గృహ అవసరాల కోసం లోఓల్టేజి విద్యుత్ సమస్య తీర్చేందుకు నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఎదుర్లంక రామాలయం పేటలో బీసీ కల్యాణ మండపానికి ప్రారంభోత్సవం చేశారు. మధ్యాహ్నం టి.కొత్తపల్లి గ్రామంలో రూ.7 కోట్లతో నిర్మించిన నూతన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామంలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. రెడ్డివారిపేటలో కమ్యూనిటీ భవనానికి భూమిపూజ చేశారు. రేవువానిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని స్థానికులతో కలసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

మౌలిక సదుపాయాల కల్పన

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా వంద రక్షిత మంచినీటి ట్యాంకులను నిర్మించి, నియోజకవర్గంలో దాహార్తిని తీర్చగలిగామన్నారు. అదే విధంగా ఆరోగ్యం కోసం మండల ప్రజలకు ఉపయోగపడే విధంగా నూతనంగా రూ.7 కోట్లతో సీహెచ్‌సీ నిర్మించామని, గత 20 ఏళ్లుగా ఇది ప్రతిపాదనలకే పరిమితమైందన్నారు. అలాగే మండలంలోని ఎదుర్లంక, పాతయింజరం, గుత్తినదీవి తదితర గ్రామాల్లో కోట్ల విలువైన లంక భూములు నదీకోతకు గురికాకుండా గ్రోయన్ల నిర్మాణ పనులు చేపట్టినట్టు వివరించారు. అలాగే నవరత్నాలు పథకాలతో పేద, బడుగు బలహీన వర్గాల వారు ఆర్థికంగా బలోపేతం అయ్యారన్నారు. ఈయన వెంట ఎంపీపీ మోర్త రాణి మిరియంజ్యోతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పిన్నంరాజు వెంకటపతిరాజు, ఢిల్లీ నారాయణ, మెండా వెంకన్నబాబు, పండు నళిని, వడ్డి గౌతమ్, పెన్మత్స కామరాజు, కాశే రాజుబాబు, ముదునూరి వరహాలరాజు, ముదునూరి అర్జునరాజు, కొండేపూడి కృపావర ప్రసాద్ తదితరులు ఉన్నారు.



టి.కొత్తపల్లిలో సీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఘనంగా సౌరయాగంలో శ్రీచక్రార్చన

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సౌరయాగంలో ఐదో రోజు శ్రీచక్రార్చన బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో రుత్విక బృందం రేవతి నక్షత్ర జాతకులతో విప్ప వృక్షానికి పూజలు చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



విలసవిల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

'పీపుల్స్ సర్వీస్' సేవలు అభినందనీయం

ముమ్మిడివరం: పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఓఎన్‌జీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ చైర్మన్ కె.సత్యనారాయణ అన్నారు. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు ఎన్.స్టీఫెన్‌బాబు కుటుంబ ఆర్థిక సహకారంతో సమకూర్చిన దుప్పట్లు, చీరలు 150 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఆయాలు, నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సంస్థ గౌరవాధ్యక్షుడు టి.నాగరాజారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బొజ్జా రమణశ్రీ, సంస్థ అధ్యక్షుడు కర్నీడి వెంకటేశ్వరరావు, ఓఎన్‌జీసీ అధికారి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు, చీరలు పంపిణీ చేసిన సత్యనారాయణ తదితరులు

సీసీ రోడ్డుకు ఎంపీపీ శంకుస్థాపన

తాళ్లరేవు: పటవల పంచాయతీలోని ఎస్సీపేట శ్మశానానికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ రాయుడు సునీత బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.ఆరు లక్షల మండల పరిషత్ నిధులతో ఈ రహదారిని నిర్మించనున్నారు. సర్పంచ్ పినపోతు చినకామేశ్వరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు రాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.